# మినీకథలు

## కొత్తరచయితలు

# అపోహ

చక్రవర్తి



ప్రియమైన చిరంజీవి సుధీప్తికి

ఆశీస్సులు!

నీ ఉత్తరం అందింది. నీవు చాలా ఆందోళనపడుతున్నట్లు నీ లేఖ స్పష్టంగా చెపుతూంది. అల్లుడు ట్రాన్సఫర్ అయి పూనా వెళ్ళి అర్థ సంవత్సరం గడిచినా నిన్ను, పిల్లలను ఇంకా ఏలూరులోనే ఉంచారని కదా నీ బాధ. యిల్లు లేకుండా మీ అందరినీ తీసుకెళ్ళి ఎక్కడ ఉంచేటట్లు? వాస్తవం నీకు తెలియదమ్మా!

నీవు చిన్నదానివి- 1962లో నాకు పూనా బదిలీ అయినప్పుడు నేను అద్దె ఇంటి కోసం ఎన్ని తిప్పలు పడ్డానో! ప్రతిరోజూ బజార్లు పట్టుకు తిరగటం. తెలిసిన వాళ్ళందరినీ కలవటం. ఇంటిని గురించివాకబుచెయ్యటం. కాళ్ళు యీడ్చుకుంటూ లాడ్జికి చేరటం. అద్దె యాక్టువల్ల ఎక్కువ మొత్తంలో డిపాజిట్ యిస్తేనే యిల్లు అద్దెకు కుదిరేది...ఒకసారి ఇంట్లో చేరితే వళ్ళను ఖాళీ చేయించటం బ్రహ్మప్రళయం. కోర్టుకు వెళ్ళినా తీర్పు అద్దెకు ఉన్న వాళ్ళ తరుపునే. మరి తెలిసి నిప్పుతో ఎవరైనా తలగోక్కుంటారా? అందుకే పూనాలో "పిల్ల దొరుకుతుందేమో కాని, ఇల్లు దొరకదని" సామెత.

పూనా సాంస్కృతిక కేంద్రం. పట్టణం పచ్చని మొక్కలతో చాలా అందంగా ఉంటుంది. విద్యాసంస్థలు ఎన్నో ఉన్నాయి. చుట్టూ కొండలతో చక్కని వాతావరణం. మరాఠీ డ్రామాలు చాలా ప్రసిద్ధి. మనుష్యులు నెమ్మదస్తులు, మంచివాళ్ళు. అందరూ తెల్లగా. ఎత్తుగా. బలిష్టంగా వుంటారు.

బొంబాయి చాలా దగ్గర (192 కిలో మీటర్లు). ఇక్కడకూడా చాలా వ్యాపార సంస్థలు అభివృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా కిర్లోస్కర్. ఫిలిప్స్. మఫత్ లాల్ ఎంతో మందికి ఉద్యోగాలు సమకూర్చుతున్నాయి. 'పార్వతి అమ్మ' వారి గుడి దగ్గరనుంచి పట్టణం మొత్తం చూడవచ్చు. సరస్‌బాగ్. శంభోజీపార్క్- జంగిల్ మహరాజా గుడి - పాతాళేశ్వరాలయం - పూనా యూనివర్సిటీ. ఫెర్గూసన్ కాలేజీ. బాలగంధర్వ థియేటరు. శనివారవాడ యింకా చాలా ప్రదేశాలు చూడతగ్గవి పూనాలో ఉన్నాయి.

పూనాకు దగ్గరలో సింహగడ్ కోట- పింపిరి - లోనావాలా - షిర్డి సాయిబాబా- అజంతా - ఎల్లోరా - గోదావరి పుట్టుక - నాసిక్ - త్రియంబకం (జ్యోతిర్లింగం)- మహాబలేశ్వర్ (కృష్ణానది ఇక్కడి నుంచి మొదలవుతుంది) కొల్హాపూర్‌లో మహలక్ష్మి గుడి యింకా ఎన్నో చారిత్రాత్మకమైన స్థలాలువున్నాయి. ఇక్కడ ఎన్ని సంవత్సరాలువున్నా నిత్యనూతనంగా ఉంటుంది. నిజానికి తెలుగు-మరాటీ సంస్కృతి ఒక్కటే. చలికాలంలో "పార్వతి గుడి" దగ్గరవుంటే కాలం ఎట్లా గడిచిపోతుందో మనకే తెలియదు.

పూనాలో చాలా మంది తమ ఇళ్ళను లాడ్జీలుగా మార్చి ఉద్యోగస్థులకు అద్దెకు ఇస్తుంటారు. ముఖ్యంగా ఎక్కువ అద్దె వస్తుందని, ఒంటరిగా ఉంటే త్వరగా ఖాళీ చేస్తారని. ఇంకా 'బుధవారపు పేట' ఉంది. అంత పెద్ద పట్టణంలో అన్ని సౌకర్యాలు ఉన్న చోట అల్లుడు ఏదో అవుతాడని కదా నీ అపోహ. ఆత్మస్థయిర్యం లేకుంటే చెడిపోవటానికి పూనే కావాలా- ఎక్కడైనా ఒక్కటే.

దేశంలో నల్లధనం మూలుగుతూవుంది. బొంబాయి నుంచి వచ్చి చాలా మంది ఎప్పుడో ఉండటానికి యిప్పుడే ఇల్లు కట్టుకొని తాళం వేసుకొని ఉంచుతున్నారు. ప్రభుత్వం పాలకులకు పరిస్థితి అవగాహన అయినా వాస్తవం గ్రహించరు. అద్దెయాక్టు మార్చరు. పెద్ద ఎత్తున గృహ సముదాయం కట్టరు. ప్రభుత్వ సంస్థలు తమఉద్యోగులకు క్వార్టర్సు యివ్వాలని పూనాలో ఇంటికి ఇబ్బంది అని తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు ఏమీ పట్టించుకోరు. ఈపరిస్థితులలో నీ'అపోహ' వాస్తవంకాదు!

ఈ లేఖ ముగించే ముందు — అల్లుడు త్వరలో అద్దె యిల్లు తీసుకుని నిన్ను, పిల్లలను తీసుకెళ్ళి పూనాలో సుఖమయ జీవితం గడపాలని ఆకాంక్షిస్తూ—

ప్రేమతో

తెనాలి — నాన్న

1-3-84 — రఘురామ్